క్లుప్తంగా

ఉపాధి కూలి ఇవ్వాలి



ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీలకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. శనివారం మండలంలోని తూంపల్లిలో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. సంబంధిత అధికారులు కూలీల ఈకేవైసీని త్వరతగతిన పూర్తి చేసి పెండింగ్ కూలి డబ్బులను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వ్యాన్‌లో పొగలు



కొత్తకోట రూరల్: రన్నింగ్‌లో ఉన్న మారుతి ఓమిని వ్యాన్‌లో అకస్మాత్తుగా పొగలు వచ్చిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి చెందిన మారుతీ ఓమిని వ్యాన్‌లో శనివారం ఉదయం 11గంటల సమయంలో పొగలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై రోడ్డు పక్కకు నిలిపేశాడు. రోడ్డు పక్కనే బైక్ మెకానిక్ షాపు ఉండటంతో వాటర్ పైప్‌తో నీళ్లను స్ప్రే చేయడంతో పొగలు అదుపులోకి వచ్చాయి. కారుకు గ్యాస్ అప్రోల్ ఉండటంతో సాంకేతిక లోపం కారణంగా పొగలు వచ్చినట్లు డ్రైవర్ తెలిపాడు.

ప్రమాదకర మలుపు



మదనాపురం: మండలంలోని కొన్నూరు సమీపంలో ప్రధాన రోడ్డుపై ప్రమాదకర మలుపుగా ఉంది. రాత్రి వేళల్లో పరిసర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు మలుపును గుర్తించక పలుమార్లు ప్రమాదాల బారిన పడ్డారు. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడి గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మలుపు వద్ద స్పీడు బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించండి



ఆత్మకూర్: పట్టణ కేంద్రం నుంచి రేచింతల వరకు వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతు శనివారం స్థానికులు వనపర్తి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. బస్సును అర్ధాంతంగా నిలిపివేయడంతో ప్రయానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఈవిషయాన్ని మక్తల్ ఎమ్మెల్యే వాకిటీ శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా డీఎంకు లేఖ రాసి ఫోన్ ద్వారా మాట్లాడినట్లు వివరించారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, బాలరాముడు, నాగేశ్వర్‌రెడ్డి, రాములు, సత్యారెడ్డి, సోమిరెడ్డి, మాధవరెడ్డి ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పెబ్బేరు రూరల్: క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసానికి తోడ్పడతాయని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం వనపర్తి మండలంలోని రాజపేటలో కీ.శే కల్కి స్వామి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఎమ్మెల్యేతో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమని, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు.

2 బైక్‌లు చోరీ

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలో రెండు బైక్‌లు చోరీ జరిగిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వనపర్తి రూరల్ ఎస్ఐ నాగన్న అందించిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగవరంతండాకు చెందిన బాబునాయక్ బైక్ రాజనగరం జాతరలో, సవాయిగూడెం గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి బైక్ ఇంటి వద్ద చోరీకి గురయినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తమని ఎస్ఐ నాగన్న తెలిపారు.

ఇసుక మాఫియాకు అడ్డేది?

- ఫిల్టర్ ఇసుకతో రూ.లక్షల వ్యాపారం
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు
- ఆరు నెలల్లో రెండు కేసులే నమోదు



ఏదుట్ల నుంచి మున్ననూరు వెళ్లే రోడ్డులో డంప్ చేసిన ఫిల్టర్ ఇసుక (ఫైల్)

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో ఇసుక అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. అయినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఉమ్మడి మండలంలో ఎక్కడా వాగులు లేకపోయినా వ్యాపారులు చిన్నపాటి కాల్వల్లో మెత్తటి మట్టిని తవ్వి ఫిల్టర్ చేసి ఇసుకగా తయారు చేసి అమ్ముకుంటున్నారు. ఇటువంటి ఇసుక తయారు చేయడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. చెరువుల్లో, వాగులతో పాటు, ఏడాదికి కొంత డబ్బును రైతులకు ఇచ్చి పొలాల్లో ఉన్న మట్టిని సైతం ఇసుకగా మారుస్తున్నారు. పొలంలోని మట్టిని వాగులు లేదా నీరు ఉన్న ప్రాంతాలకి తరలించి ఫిల్టర్ చేసి ట్రాక్టరుకు రూ.మూడు వేల నుంచి రూ.4,500 వరకు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని మండల వాసులు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి

రేవల్లి మండలంలో బండరావిపాకుల, కొంకలపల్లి, ఏదుల రిజర్వాయర్ సమీప ప్రాంతాలు, కేశంపేట పాత తండా, కొత్తతండా, తల్పునూరు శివారు ప్రాంతాల్లో ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్నారు. అలాగే గోపాల్‌పేట మండల కేంద్రం నుంచి చెన్నూరు వెళ్లే దారిలోని వాగు పరిసర ప్రాంతాలు, పొలికెపాడు శివారు,, ఏదుట్ల నుంచి మున్ననూరు వెళ్లే రోడ్డులో, లక్ష్మీదేవిపల్లి శివారు ప్రాంతాల్లో ఇసుకాసురులు యథేచ్ఛగా మట్టిని ఫిల్టర్ చేసి కుప్పలుగా పోసి, రాత్రి సమయంలో జేసీబీలు, ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. రేవల్లి మండలంలో ఎక్కువ మొత్తంలో ఫిల్టరింగ్ చేసి ఏదుల, రేవల్లి, కొత్త బండరావిపాకుల, నాగర్‌కర్నూల్‌కు సైతం



రేవల్లి పాలమూరు రంగారెడ్డి కాల్వ పక్కన ఇసుక ఫిల్టర్ చేసేందుకు ఏర్పాటు చేసిన కొళాయి (ఫైల్)

పంపిస్తున్నారని తెలిసింది. ఫిల్టర్ ఇసుకతో కట్టడాలు ఎక్కువ రోజులు మన్నిక ఉండవని తెలిసినా సమీప ప్రాంతాల్లో ఇసుక అందుబాటులో లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాలకు ఇదే ఇసుకను వాడుతున్నారు.

ఒక్క కేసు లేదు

ఇంత జరుగుతున్నా ఆరు నెలల నుంచి రేవల్లి పోలీస్టేషన్‌లో ఇసుక తరలింపునకు సంబంధించి ఒక్క కేసు నమోదు కాలేదు. అలాగే గోపాల్‌పేట మండలంలో కేవలం రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఇసుక ఫిల్టర్ చేసి అమ్ముకుంటున్నారు అని ఎవరైనా పోలీసుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే వారిని వేధింపులకు గురిచేస్తారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఫిల్టర్ ఇసుక దందాను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్య తీసుకోవాలి



చాలా రోజులుగా ఏదుట్ల నుంచి మున్ననూరు వెళ్లే రోడ్డులో కాశీంనగర్‌కు చెందిన కొందరు ఫిల్టర్ ఇసుక వ్యాపారం చేస్తున్నారు. వేరే ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ రైతులతో పొలం లీజుకు తీసు కుని మట్టిని ఫిల్టర్ చేసి ఇసుక తయారు చేసి సరఫరా చేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని ఫిల్టర్ ఇసుక వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలి

– విష్ణు, ఏదుట్ల

అక్రమంగా తరలిస్తే చర్యలు

రేవల్లి మండలంలో ఆరు నెలల్లో ఎటువంటి ఇసుక అక్రమ తరలింపు కేసులు నమోదు కాలేదు. ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్నారని మా దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తాం. అలాగే అనుమతులు లేకుండా ఇసుక తరలింపు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

– శివకుమార్, ఎస్ఐ, రేవల్లి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రేవల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి



తెల్లరాళ్లపల్లితండాలో..



పామిరెడ్డిపల్లిలో..

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన' కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లిలో నిర్వహించిన ప్రజాపాలనలో ఆయన దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్‌నాయక్, ఎంపీపీలు రఘుప్రసాద్, కిచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: రేవల్లిలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలందరికీ న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచు గౌతమి, జెడ్పీటీసీ భీమయ్య, పీఏసీఎస్ చైర్మన్ రఘు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం చిమనగుంటపల్లి పడమటితండాలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. రాజపేటలో క్రికెట్ పోటీలు, పెద్దగూడెంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కిచ్చారెడ్డి, సర్పంచ్‌లు రాజేశ్వరి, ఎంపీటీసీ ధర్మశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల వ్యాప్తంగా 28 పంచాయతీల్లో 17,030 దరఖాస్తులు వచ్చినట్లు మండల ప్రత్యేకాధికారి రహిమాన్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో 420, తెల్లరాళ్లపల్లితండాలో 741 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాయి, ఇన్‌చార్జీ ఎంపీడీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్‌లు రేణుమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని పది వార్డుల్లో 5,507 దరఖాస్తులు, మండలంలోని 13 పంచాయతీల్లో 9,158 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలో 14,317, పెబ్బేరు 13,040, శ్రీరంగాపురంలో 5,166 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓలు ప్రవీణ్‌కుమార్, ప్రసన్నకుమారి, సుదర్శన్, తహసీల్దార్లు మురళిగౌడ్, లక్ష్మి, యాదగిరి పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని వెనికితండా, వెంకటాంపల్లి గ్రామాల్లో శనివారం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించగా.. 1,457 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా 11,903 దరఖాస్తులు, రేషన్ కార్డుల కోసం 4,257 దరఖాస్తులు కలిపి మొత్తం 16,160 దరఖాస్తులు వచ్చాయని ఆయన చెప్పారు.

రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం



మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ కేంద్రంలోని రోడ్డు విస్తరణ పనులు మూడు నెలలుగా నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు, దుకాణాదారులు ఇబ్బందులు పడుతున్నారని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్ తెలిపారు. అఖిలపక్ష నాయకులు పట్టణంలోని రామాలయం నుంచి పాతబజార్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లుగా రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసి నెల రోజులు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదన్నారు. దీన్ని అలుసుగా తీసుకున్న వ్యాపారస్తుల షాపుల ఎదుట అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారని, వెంటనే వాటిని తొలగించి రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించాలని కోరారు. పాత యూకోబ్యాంక్ మలుపు, కన్యకా పరమేశ్వరి ఆలయం, రామా టాకీస్ వద్ద రోడ్డు అసంపూర్తిగా వదిలేయడంతో దుమ్ముతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో షఫి, శివకుమార్, బాలు, రామకృష్ణ, రమేష్, యుగంధర్, పాండు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కార్మికుల అభ్యున్నతికి కృషి



సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మదనాపురం: మండలంలోని దుప్పల్లి గ్రామ మత్స్య పరిశ్రమక సహకార సంఘం కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చీర్ల లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా చింతకుంట రాములు, కార్యదర్శిగా గొడగు రాములు, డైరెక్టర్లుగా గొడగు కుర్మన్న, రాములు, చీర్ల మహేందర్, చంద్రయ్య, గొడగు చిన్నకుర్మన్న, దర్గాకాడి చంద్రయ్యను సభ్యులుగా నియమించారు. నూతన కమిటీ సభ్యులను మహాదేవన్‌గౌడ్, ఖాజామైనోద్దీన్ శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో శేఖర్, చక్రవర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ రాములు, ఉద్దోతుల రాములు, రాజవర్ధన్‌రెడ్డి, గొల్లరాజు, ఖాజా బాయి, ఉద్దోతుల కురుమన్న, రాఘు, రాములు, కేశర్‌నాథ్‌గౌడ్, రవికుమార్‌రెడ్డి, అరుణ్, కల్లు బండి మాసన్న, సంజీవులు, ఖాజారామ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన



మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: తొలిమెట్టు కార్యక్రమంపై మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న మూడు రోజుల సమావేశాలు శనివారంతో ముగిసినట్లు కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు చెందిన ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ సబ్జెక్టుపై అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతి, లక్ష్య కార్యక్రమం అమలు, విద్యార్థుల కనీస సామర్థ్యాలు సాధించేలా బోధన చేయాలన్నారు. ఈ సందర్భంగా సబ్జెక్టులోని మెలకువలను వివిధ పాఠశాలల ఉపాధ్యాయులతో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో చర్చించిన, అవగాహన కల్పించిన అంశాలను పాఠశాలల్లో అమలు చేస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీ రవి కుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అదనపు బస్సులను కేటాయించాలి



డిపో ఇన్‌చార్జ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

వనపర్తి టౌన్: మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జగదీశ్ అన్నారు. దీంతో విద్యా సంస్థల సమయాల్లో విద్యార్థులకు బస్సులు అందుబాటులో ఉండేలా చూడాలని ఈ మేరకు శనివారం డిపో ఇన్‌చార్జ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులు సమయానికి రాక విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు ఆలస్యంగా వెళ్తున్నారని, విద్యార్థులకు అదనపు బస్సులు కేటాయించేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల, కళాశాలల నుంచి విద్యార్థులు ఇంటికి చేరుకోవడానికి రాత్రి 9గంటల సమయం పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్తీక్, పరశురాం, నితీన్, హరి తదితరులు పాల్గొన్నారు.

చెంచుల మూలాలపై పరిశోధనలు చేయాలి

కొల్లాపూర్: నల్లమల అటవీ ప్రాంతాల్లో నివసించే చెంచుల మూలాలపై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని సామాజిక వేత్త పసుపుల నర్సింహ అభిప్రాయపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీతో పాటు, సికింద్రాబాద్ పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటన కోసం కొల్లాపూర్ వచ్చారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో వారు అధ్యాయన అంశాలపై చర్చ నిర్వహించారు. చర్చకు పసుపుల నర్సింహను ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ చెంచుల మూలాలు, తమిళనాడుకు చెందిన ఓ గిరిజన తెగతో వీరికి ఉన్న సంబంధాలను కొన్ని గుర్తించామన్నారు. వాటిపై పూర్తిస్థాయిలో పరిశోధనలు చేపట్టేందుకు విద్యావంతులు ముందుకు రావాలన్నారు. వారి జీవన స్థితిగతులను మెరుగుపర్చేందుకు సోషల్‌వర్కర్లు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో క్యాంపు ఇన్‌చార్జ్ శంకర్, అధ్యాపకుడు దేవరాజ్ ఉన్నారు.

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి



వనపర్తి టౌన్: నాలుగేళ్లకే కంటిచూపు కోల్పోయినా.. 17 ఏళ్ల వయస్సులో ప్రొఫెసర్‌గా ఎదిగి అంధులకు అక్షరజ్ఞానం అందించిన ప్రతిభామూర్తి లూయిస్ బ్రెయిలీ అని ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాశ్ అన్నారు. లూయిస్ బ్రెయిలీ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, పరమేశ్వర చారి, మాధవచారి, బాలస్వామి నాయుడు, దేవన్న నాయుడు తదితరలు పాల్గొన్నారు.

పేద రైతును ఆదుకోండి

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోలు చెందిన పూజారి భీముడు తన వ్యవసాయం పొలం వద్ద విద్యుత్ షాక్‌కు గురై కుడిచేయి కోల్పోయాడు. బ్యాంకులో అప్పు చేసిన భీముడికి కుటుంబాన్ని పోషించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రభుత్వం రైతును ఆదుకోవాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఏసయ్య కోరారు. భీముడికి భార్య బంగారమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

వైద్య సేవలపై అవగాహన

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎంఎస్‌డబ్ల్యూ కోర్సు చదువుతున్న విద్యార్థులు శనివారం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా వారు రోగులకు అందే సేవలు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అడ్మినిస్ట్రేషన్ విధానాన్ని ఫార్మాసిస్టు వెంకటేష్ వివరించారు. టీబీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షల విధానాలను తెలియజేశారు. హెచ్ఐవీకి సంబంధించిన అంశాలను ఐసీటీసీ కౌన్సెలర్ సురేందర్‌గౌడ్ వివరించారు. విద్యార్థుల వెంట కళాశాల అధ్యాపకుడు వెంకటేశం ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



పాన్‌గల్‌లో బడిఈడు పిల్లల సర్వేలో సీఆర్పీలు



గుంటిపల్లిలో..

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన మెరుగైన విద్య అందిస్తున్నామని, మధ్యలో చదువు మానేసిన పిల్లలను పాఠశాలలకు పంపాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. శనివారం మండలంలోని గ్రామాల్లో బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీ సౌమ్య రాణి ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు.

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి అన్నారు. బడి ఈడు పిల్లల ఇంటింటి సర్వేలో భాగంగా శనివారం మండల కేంద్రంలో బడి మానేసి ఇంటి పనులు చేస్తున్న విద్యార్థుల వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్య యొక్క ప్రాధాన్యత, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరించారు.

రామచంద్రస్వామి అక్షింతలు పంపిణీ



పామిరెడ్డిపల్లిలో అక్షింతలు ఊరేగిస్తున్న భక్తులు



అప్పరాలలో..



రాజపేటలో..

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో శనివారం ఉదయం అయోధ్య నుంచి గ్రామానికి చేరుకున్న అక్షింతలను ఊరేగించారు. అనంతరం అక్షింతలను ఇంటింటికీ అందించారు. ఈ నెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా అందరూ ఇళ్లలో దీపాలు వెలిగించి, అక్షింతలను నెత్తిన చల్లుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు సూచించారు. మన్నెపురెడ్డి, యాదవరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, నరసింహారెడ్డి, ఓంప్రకాశ్‌రెడ్డి, ప్రవీణ్, యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని రాజపేటలో శనివారం భక్తులతో కలిసి రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అయోధ్య నుంచి వచ్చిన పూజిత అక్షింతల కలశాలకు పూజలు నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి అక్షింతలతో పాటు ఆలయ ఫొటో, కరపత్రాన్ని పంపిణీ చేశారు.

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంతో పాటు అప్పరాల, అమడబాకుల, సత్యహళ్లి, కానాయపల్లి గ్రామాల్లో శనివారం అయోధ్య నుంచి తీసుకొచ్చిన శ్రీరాముడి పూజిత అక్షింతలను హిందూవాహిని, శ్రీరాముడి భక్తులు ఇంటింటికీ తిరుగుతూ పంచిపెట్టారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోనే రాముడికి అక్షింతలు వేయాలని భక్తులు ప్రజలను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తిరుపతయ్య, అప్పరాల సర్పంచ్ హిమబిందు, ఎంపీటీసీ చిట్టెమ్మ, కృష్ణయ్యముదిరాజ్, దస్తగిరి, చిన్న, శంకర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

ఇంటింటికి రాములోరి అక్షింతలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇళ్లలో దీపాలు వెలిగించాలని సూచించారు.

ముగ్గుల పోటీలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మనిగిళ్ల జెడ్పీహెచ్‌లో వనపర్తి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జెడ్పీహెచ్‌ఎస్ నుంచి 33 ముగ్గులు, ప్రాథమిక పాఠశాల నుంచి 30 ముగ్గులు వేశారు. ఇందులో మొత్తం 126 మంది విద్యార్థులు హాజరయ్యారు. కొందరు విద్యార్థులు సామాజిక సందేశాలను ప్రజలకు తెలిసే విధంగా అవైడ్ కరోనా, శుభ్రత ఆరోగ్యానికి రక్ష, సేవ్ నేచర్, డోరోమ్యాన్ వంటి ముగ్గులను చూడ ముచ్చటగా వేశారు. వైశాలి, వాణిశ్రీ, సంగీత, మీనాక్షి, అఖిల, అనూష, శ్రావణి, కీర్తన, పరిమళ, జ్యోతి, ఇందు, దీపిక, పూజిత, జ్వాల, తేజశ్రీ, శ్రావణి ప్రతిభ కనబర్చడంతో ఆర్యవైశ్య సంఘం, వనపర్తి పట్టణ గౌరవ అధ్యక్షుడు గోనూరు యాదగిరి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్‌గౌడ్, పీఎస్ హెచ్‌ఎం జ్యోతి, గ్రామ కార్యదర్శి కృష్ణానాయక్, ఉపాధ్యాయ బృందం చంద్రకళ, సురేంద్రనాథ్, సురేఖ, శ్రీలక్ష్మి, బాలాజీ, విజయ్‌కుమార్, కస్తూరి, శ్రీరాం తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న యాదగిరి